www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబర్ 2024
5
చిత్తూరు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగీపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, 'దోమలు పుట్టకుండా, కుట్టకుండా' జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. నిల్వ ఉన్న మురుగు నీటిలో మలేరియా కారక 'ఆడ అనాఫిలిస్' దోమలు, నిల్వ ఉన్న మంచినీరు, వాన నీటిలో డెంగీ కారక 'టైగర్' దోమ పెరిగి ఆరోగ్యవంతులను కుట్టడంతో మలేరియా, డెంగీ వస్తుందని, ప్రతి జ్వరం కేసును రక్త పరీక్ష ద్వారా నిర్ధారణ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పని సరిగా పాటించాలన్నారు. అన్ని హాస్టల్స్, స్కూల్స్‌లో క్రిమినాశకాలను స్ప్రే చేసి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాసరెడ్డి, జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

నేడు నగరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరి ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 10న (గురువారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ, మండల స్థాయి అధికారులు హజరు కావాలని ఆదేశించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14న జాబ్ మేళా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళలో పాల్గొన్నాలని కోరారు. ఐటిఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అప్రెంటిస్ చేసేందుకు ఐబిఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని లేకుంటే ఐటిఐలో నమోదు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో అప్రెంటిస్ చేసేందుకు 14వ తేది జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుప్పం అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

- కడా పీడీ వికాస్ మర్మత్

మీడియాతో మాట్లాడుతున్న కడా పీడీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పంకు 17 డివిజినల్ స్థాయి అధికారులను ప్రభుత్వం నియమించిందని కుప్పం అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారని కడా ప్రత్యేక అధికారి వికాస్ మర్మత్ తెలిపారు. గత వంద రోజుల పాలనలో కుప్పంలో జరిగిన అభివృద్ధిపై బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుప్పంని సీఎం ప్రయోగశాలగా ఎంచుకున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని, వీటికి అవసరమైన సర్వేలు ఇప్పటికే నిర్వహించామన్నారు. ప్రతి ఇంటిలో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

నిరుద్యోగ నిర్మూలనకు స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు కుప్పంలో పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు రావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మూడు ప్రాజెక్టుల ప్రారంభానికి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. గ్రామ సమస్యలు తెలుసుకోవడానికి తనే స్వయంగా ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఒక్కొక్క గ్రామంలోని బుధవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం ద్వారా గ్రామ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

అయ్యప్పగారిపల్లె గ్రామంలో పేరుకుపోయిన మురుగునీరు

పూతలపట్టు - రామాపురం రోడ్డులో నిల్వ ఉన్న చెత్త

పల్లె ప్రగతి తప్పుతోంది..!

- గ్రామీణ ప్రాంతాల్లో పడకేసిన పారిశుధ్యం
- ప్రభుత్వాలు మారినా తీరు మారలే..
- మౌలిక సదుపాయాల కల్పనలోనూ అదే నిర్లక్ష్యం

ప్రభుత్వ పాలకులు మారారంతే.. అధికారులు వారే.. అదే నిర్లక్ష్యం.. అవే సమస్యలు.. దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించక, పారిశుధ్యం లోపించి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. గత పాలకులు చేసిన తప్పులను, గాడి తప్పిన పాలనను తిరిగి సమర్థవంతంగా పరిపాలిస్తామన్న కూటమి నేతల మాటలు నీటి మూటలేనని పల్లెల్లో సమస్యలే అద్దంపట్టి ఉదాహరణ చూపుతున్నాయి. నిర్లక్ష్యం వీడని అధికారులు, పాలకుల వైఫల్యంతో గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందనే చెప్పుకోవచ్చు.

- ప్రజాశక్తి-పూతలపట్టు

గ్రామీణ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. పారిశుధ్యం లోపించి ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు కాలువల్లో నీరు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త చెదారం వీధుల్లో నిండుకుంది. వర్షాలు పడుతున్న కారణంగా.. చెత్త కుళ్ళి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామీణ ప్రజలు పారిశుధ్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. అదేవిధంగా గ్రామీణ రహదారులైతే ప్రజలకు నరకప్రాయంగా తయారయ్యాయి. మేజర్ పంచాయతీల్లో సైతం పారిశుధ్యం అత్యంత దారుణంగా తయారైంది. కుళ్ళిన చెత్తాచెదారం ఒకవైపు.. కాలువల్లో పేరుకుపోయిన మురికి నీటితో మరోవైపు.. దోమల బెడద అధికమై ప్రజలు విష జ్వరాలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. మరికొందరైతే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో ప్రాణాలను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అనేకమంది డెంగీ విషజ్వరాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం కనిపిస్తున్నాయి.

మాటలకే పరిమితమా..

ప్రస్తుత డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీరం చేసిన విధంగా తాము చేయబోమని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పారిశుధ్యం అత్యంత దారుణంగానే ఉంది. ప్రతి కుటుంబంలోనూ ఒకరిద్దరూ జ్వరాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నా.. పట్టించుకునే నాధులే లేరు. ప్రస్తుతం వైద్య శాఖ పరిస్థితి కూడా ఇంకా నిర్లక్ష్యంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడినా వైద్య సిబ్బంది మాత్రం తమకేమీ పట్టనట్టు చూసి చూడకుండా వెళ్ళిపోతున్నారని చెబుతున్నారు. పంచాయతీ అభివృద్ధిని పట్టించుకోవాల్సిన కార్యదర్శులు సైతం ఏమి పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టడంతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పల్లె ప్రజలు కోరుకుంటున్నారు.

గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

అంబేద్కర్ విగ్రహ స్థల పంచాయితీ

- గ్రామస్తుల అభిప్రాయాలు సేకరణ
- కలెక్టర్‌కు నివేదించనున్న అధికారులు

ప్రజాశక్తి - సదుం: ఊరికి మంచి చేయాలని అంబేద్కర్ విగ్రహాన్ని ఓ వర్గం రాములవారి గుడి సమీపంలో ఏర్పాటు చేస్తుండగా, మరో వర్గం గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా చేశారని, అక్కడినుంచి విగ్రహాన్ని వేరే ప్రాంతానికి మార్చాలన్న వివాదం తారాస్థాయికి చేరింది. ఇరు వర్గాల ఫిర్యాదులతో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్, ఎస్ఐ సమయంలో 'పంచాయితీ' జరిగింది. ఇరు వర్గాల అభిప్రాయాలను విన్న అధికారులు నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అప్పటివరకూ గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏదిఏమైనా పెత్తందారులకు వ్యతిరేకంగా వివక్షపై దళితులంతా ఏకమవ్వాల్సి ఉండగా, దళితులే రెండు వర్గాలుగా చీలిపోయి స్థల వివాద సమస్యను సృష్టించుకోవడంపై చర్చ నడుస్తోంది. అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కలకటవారిపల్లి దళితవాడలో గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు పూనుకున్నారు. అయితే ఈ విగ్రహం ఏర్పాటు స్థల వివాదంపై దళితవాడలోనే అభిప్రాయబేధాలు పొడసూపాయి. కలెక్టర్‌కు ఇరు వర్గాల వారు ఒకటికి రెండుసార్లు ఫిర్యాదు చేయడంతో గ్రామస్తులతో కమిటీ వేసి మెజార్టీ అభిప్రాయం మేరకు విగ్రహ స్థల సమస్యను పరిష్కరించాలని గత వారం సదుం తహశీల్దార్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సదుం తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్, సదుం ఎస్ఐ షేక్‌షా వల్లి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ డిఎస్ హరిబాబు బుధవారం కలకటవారిపల్లి దళితవాడకు వెళ్లి గ్రామస్తులతో విచారణ చేపట్టారు. గ్రామస్తులను పేరుపేరునా పిలిచి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఓ వర్గం వారు దళితవాడలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం ముందు ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వేరే చోటికి తరలించాలని విన్నవించారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఎస్ఎ విశ్రాంతి ఉద్యోగి శిబ్యాల యర్రయ్య, పద్మవతమ్మ దంపతులు గ్రామానికి మంచి చేయాలనే అభిప్రాయంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అనవసరంగా కొంతమంది విగ్రహ ప్రారంభోత్సవానికి అడ్డు తగులుతున్నారని వాపోయారు. మూడు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, నిచ్చెనను ఏర్పాటు చేశామని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా గ్రామంలోని ఇంకో వర్గం విగ్రహం ఏర్పాటుపై గ్రామంలో అందరి అభిప్రాయాలను వారు తీసుకోలేదని, కోదండ రామస్వామి దేవాలయం ముందు ఏర్పాటు చేసిన విగ్రహం ప్రహరీ గోడకు అతి దగ్గరగా ఉందని, హిందూ మనోభావాలు దెబ్బతింటాయని, హిందువులకు అసౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఇరు వర్గాల అభిప్రాయాలను తీసుకున్న తహశీల్దార్ అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. విచారణ సందర్భంగా గ్రామస్తులు పెద్దఎత్తున గుమిగూడారు. తిరుపతి, మదనపల్లి, పీలేరు నుండీ దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున కలకట వారి పల్లి దళిత వాడకు చేరుకోవడంతో ఒక దశలో ఇరువర్గాలు మధ్య గలాటాలు జరుగుతాయోమోనని గ్రామస్తుల్లో కొంత ఆందోళన ఏర్పడింది. సదుం ఎస్సై షేక్ షావలి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో గ్రామ కమిటీ ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు యమలా సుదర్శనం, పరమశివం, పోతన్న, మాజీ డిఎస్పి రామచంద్రయ్య, విశ్రాంత లెక్చరర్ రామచంద్రయ్య, గుండా మనోహర్, యమల చంద్రయ్య, స్థానిక దళిత నాయకులు ఆర్ వి రమణ, మల్లేపల్లి శ్రీనివాసులు, రామచంద్రయ్య, శ్రీరాములు, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

సుప్రీం తీర్పు బాబుకు నచ్చలేదు : భూమన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శ్రీవారి లడ్డు కల్తీపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు నచ్చలేదని, ఢిల్లీ పర్యటన చేయడం విడ్డూరంగా ఉందని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఢిల్లీ పర్యటనపై భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. కల్తీ లడ్డు కాదు అసలైన నెయ్యితో చేసిన ప్రసాదం అంటూ ప్రధాని మోడీ దగ్గర చంద్రబాబు చమత్కరించే వ్యాఖ్యలు చేయడం చూస్తే చంద్రబాబు దుర్బుద్ధి మరోసారి బయట పడిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత స్వతంత్ర దర్యాప్తు బందం ఏర్పాటు చేసిన తర్వాత కూడా సిఎం వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రధాని మోదిని సి.బి.ఐని ప్రభావితం చేసేలా చంద్రబాబు వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

'చిత్తూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు'



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ విక్రమ్ మాథ్యూస్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ వెల్లూరు, చిత్తూరు క్యాంపస్‌లో కొత్త మెడికల్ కళాశాల, టీచింగ్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తున్నట్లు అజీమ్ ప్రేమ్ ఫౌండేషన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనురాగ్ బెహర్, సిఎంసి వెల్లూరు డైరెక్టర్ డాక్టర్ విక్రమ్ మాథ్యూస్ తెలిపారు. బుధవారం వారు చిత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన వారికి ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్యను అందించడానికి, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా మెడికల్ కళాశాలని ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ఉన్న 120పడకల ఆసుపత్రిని 402పడకలతో బోధనాసుపత్రిగా మార్చనున్నట్లు తెలిపారు. సిఎంసి వెల్లూరుకు రూ.500కోట్లు గ్రాంటు మంజూరు చేసిందన్నారు. ఈ గ్రాంట్ వైద్య విద్యలో అగ్రగామిగా ఉన్న సీఎంసీ వెల్లూరు ఎంబిబిఎస్ విద్య భారతీయ ఆరోగ్య సంరక్షణ రంగంలో విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరించడానికి ప్రాథమిక, ద్వితీయ ఆరోగ్య సంరక్షణ, క్రమశిక్షణపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుందన్నారు. "చిత్తూరు క్యాంపస్‌లోని కొత్త మెడికల్ కళాశాల, టీచింగ్ హాస్పిటల్ మన దేశ ఆర్థిక సామాజిక వనరుల పరిమితులకు సున్నితమైన వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశోధన ప్రతిరూప నమూనాను అందించనున్నట్లు చెప్పారు.

క్రీడా స్టేడియం ఏర్పాటు చేయండి

శాప్ ఛైర్మన్ రవి నాయుడుకు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ వినతి

శాప్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న సుకుమార్ బాబు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో క్రీడా స్టేడియం ఏర్పాటు చేయాలని శాప్ ఛైర్మన్ రవి నాయుడును నేషనల్ వాలీబాల్ కోచ్, విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు బుధవారం వినతిపత్రం అందించారు. ఇటీవల శాప్ ఛైర్మన్‌గా నియమితులైన రవి నాయుడును కలిసిన సందర్భంగా సన్మానించారు. నూతన ఛైర్మన్‌తో ఆయన మాట్లాడుతూ పుంగనూరులో గత ప్రభుత్వ హయాంలో క్రీడా స్టేడియం కోసం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్టేడియం కోసం స్థలం కూడా కేటాయించినట్టు చెప్పారు. కానీ గత ప్రభుత్వంలో ఏమి చేయక ఉండిపోయారని కనీసం ఇప్పుడైనా స్టేడియంను పూర్తి చేయాలని కోరారు. పుంగనూరులో జాతీయ క్రీడాకారులు చాలా మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సులోచన, ప్రగతి సేవా సంస్థకోశాధికారి, ఆర్యవైశ్య తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు మానుకోవాలి: సీపీఎం

ప్రజాశక్తి-విజయపురం(నింద్ర): ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులపై వేధింపులు, తొలగింపులు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం నింద్ర మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ మార్గం చూపుతున్న సీపీఎం విధానాలను ప్రజలందరూ బలపరచాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లాలో అనేక ప్రజా పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ మూతబడినప్పుడు, ఆ తర్వాత జరిగిన పోరాటాల్లో సీపీఎం రైతులకు అండగా నిలిచిందన్నారు. పేదల నివసిస్తున్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26, 27తేదీల్లో చిత్తూరులో జరగనున్న సీపీఎం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నింద్ర మండల సీపీఎం శాఖ కార్యదర్శిగా సంతోష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు, మండల సీనియర్ నాయకులు చిరంజీవమ్మ, మల్లికా తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద రక్షిస్తాం

- డీఎఫ్‌వో భరణి

బాధ్యతలు స్వీకరిస్తున్న భరణి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడుల నుంచి ప్రజలను, పంటలను రక్షిస్తామని జిల్లా నూతన అటవీ శాఖ అధికారి భరణి అన్నారు. కాకినాడ, కోయంబత్తూరులో పని చేసి చిత్తూరు డిఎఫ్ఒగా బదిలీపై వచ్చారు. బుధవారం చిత్తూరు డీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే వర్షకాలం కావడంతో ఎనుగుల సంచారం పంటపోలాలపై పడే అవకాశాలున్నాయని ఏనుగులు పంటపొలాలపై దాడులు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఏఏ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం ఉంటుందో మ్యాపింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

చింతలపట్టెడ వద్ద

చెత్త శుద్ధి కరువై.. నిర్లక్ష్యానికి నెలవై..

- నగరి మున్సిపాలిటీ పరిధిలో కంపు కంపు
- వార్డుల్లో అధ్వానంగా పారుశుధ్యం
- కాలువల్లో కదలని మురుగు
- కుండీల్లో, రోడ్డు పక్కన తొలగని చెత్త
- పన్నుల డబ్బులు ఏమయ్యాయో..!

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా పారిశుద్ధం అస్తవ్యస్తంగా మారింది. మురికి కాలువలు మరింత అధ్వానంగా తయారైయ్యాయి. పూడికతీత పనులు చేపట్టి ఏళ్లు గడిచినట్లు కనిపిస్తా ఉంది. చెత్తకుండీలో వేసిన చెత్తను తీయడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా మురికి కుంటల్లో పందులకు నివాసంగా మారింది. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలను కాటు వేస్తున్నాయి.

వార్డుల్లో అధ్వానంగా మురికి కాలువలు

మున్సిపాలిటీలో మురికి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా చింతలపట్టుడు దేశం ఆలయం వద్ద మురికి కాలువల్లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మురికి కాలువలు పూడిక తీత పనులు కూడా చేపట్టలేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తకుండీలు లేకపోవడంతో..

స్థానిక ప్రజలు వాడిన చెత్తను రోడ్డుపై వేయడంతో పారిశుధ్యం లోపించింది. మున్సిపాలిటీ అధికారులు అక్కడక్కడ చెత్తకుండీలను ఏర్పాటు చేయవలసి ఉంది. అయితే చాలా చోట్ల కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో స్థానిక ప్రజలు చేత్తను వేయడానికి ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించకపోవడంతో అందులో పందులు, శునకాలు వీరవిహారం చేస్తున్నాయి.

వృద్ధి చెందుతున్న దోమలు

పారిశుధ్య లోపం కారణంగా మున్సిపాలిటీలో దోమలు ఎక్కువైయ్యాయి. దోమల నివారణ కోసం అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో రాత్రిపూట దోమ కాటు వలన స్థానిక ప్రజలు నిద్ర లేకుండా తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరికొంత మంది జ్వరంతో బాధపడి ఆసుపత్రి పాలవుతున్నారు.

పన్నుల సొమ్ము ఏమైనట్టో..

నగిరి మున్సిపాలిటీలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం కోసం అధికారులు నిధులను ఖర్చు చేయవలసి ఉంది. అయితే మున్సిపాలిటీలో ఏడాదిలో లక్షల రూపాయలు పన్నుల రూపంలో వస్తున్న ఆ డబ్బులను అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు కనీస అవసరాలను కూడా తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టి, తాగునీరు అందించడం, మురుగు కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

కుశస్థలి నది వద్ద

దేశమ్మ గుడి వద్ద

చింతలపట్టెడ అంగన్వాడీ స్కూల్ సమీపంలో

వీఆర్‌ఏల కార్యవర్గం ఎన్నిక

వీఆర్‌ఏల సంఘం నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల వీఆర్‌ఏల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు కోదండ తెలిపారు. మండల వీఆర్‌ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్ ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా గోవిందస్వామి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, కోశాధికారిగా జీవరత్నం, కార్యదర్శిగా నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ వీఆర్‌ఏల జీతాల పెంపు, ఉద్యోగోన్నతి, ఉద్యోగ భద్రత వంటి ప్రధాన సమస్యలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మణ్, మండల వీఆర్‌ఏలు బాబు, గణపతి, తంగరాజులు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

కార్యదర్శులను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: మండలంలోని సోమల, దిడ్డివారిపల్లి సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న సుధాకర్ కుమార్, దివ్యభారతిలు బదిలీ అయ్యారు. కాగా సచివాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. ఆదర్శవంతమైన బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు.

టీడీపీలో చేరిక

నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: మండలంలోని పలువురు వైసీపీ నాయకులు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పిళ్ళారి కుప్పంకి చెందిన సుబ్రమణ్యం రెడ్డి, పుత్తూరు మార్కెటింగ్ కమిటి డైరెక్టర్ కర్ణం జయచంద్ర నాయుడులు తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామం ఆరిమాని గంగమ్మ ఆలయం వద్దకు విచ్చేసన ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను కలిశారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, జలంధర్ నాయుడు, బాల సుబ్రమణ్యం, ఏకాంబరం, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి'

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-సోమల: గర్భిణులు తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని వైద్యాధికారులు బాలాజీ, సోనియా అన్నారు. మండలంలోని పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎం ఎస్‌ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా లోకనాథ పిళ్ళై బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు చేపడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: మండల తహశీల్దార్‌గా లోకనాథ పిళ్ళై బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఇది వరకు ఆయన డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేశారు. మంగళవారం ఆయనకు తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతి లభించింది. కాగా ఎస్‌ఆర్ పురం తహశీల్దార్‌గా నియమితులైయ్యారు. గతంలో 2017-2019 వరకు కలెక్టర్ సీసీగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పంచాయతీ ఈవోగా నాగరత్నమ్మ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటినగరం పంచాయతీ ఈవోగా నాగరత్నమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచా యతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు సిబ్బంది ఆమెకు శుభాభినందనలు తెలిపి పరిచయం చేసుకున్నారు.

నాలుగు నెలల్లో అనేక తప్పులు

- మా కన్నా ఎక్కువ అభివృద్ధి చేయండి
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి
- అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: టీడీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే బోయకొండలో చిన్న చిన్న నాయకులు అనేక తప్పులు చేశారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని బోయకొండ గంగమ్మకు శాసన సభ్యునిగా బుధవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో అనేక కార్యక్రమాలను బోయకొండ అభివృద్ధికి చేపట్టామన్నారు. సుమారు 4వందలు నుంచి 5వందలు కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ ఈ జిల్లా సీఎం కావడంతో బోయకొండను మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. తమ కన్నా ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాలని చెప్పారు. చేసిన తప్పులను సర్దుబాటు చేసుకుని తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎవరి బ్రతుకుతెరువు వారు చూసుకుని అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. ఆలయ ఈవో ఏకాంబరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సతీమణి స్వర్ణమ్మ, తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి, మాజీ బోయకొండ అభివృద్ధి కమిటీ ఛైర్మన్లు మిద్దింటి శంకర్ నారాయణ, నాగరాజు రెడ్డి, అంజి బాబు, కొండవీటి నాగభూషణం, కృష్ణమూర్తి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల నివేదికలివ్వండి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికలను ఈనెల 10వ తేదీ నాటికి కలెక్టరేట్‌కి అందించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీవోలను, తహశీలార్లను ఆదేశించారు. బుధవారం జేసీ ఛాంబర్ వద్దనున్న సమావేశపు మందిరంలో ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన నివేదికలపై మండలాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సీసీఎల్‌ఏ ద్వారా ప్రతి మండలానికి అందిన వివరాల మేరకు మొత్తం విస్తీర్ణం, ట్రాన్సెక్షన్స్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాంశాలన్నింటినీ పూర్తిగా క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మా- 4, 5లను పూరించి ఎక్సెల్ షీట్‌లో అప్లోడ్ చేయాలని కోర్టు కేసులు, డబుల్ ఎంట్రీలు, పిఓటి ఇలా ఎటువంటి రిమార్క్స్ ఉన్న అందులో చూపాలని ఆదేశించారు. ప్రతి మండలం వారీగా ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూముల్లో సర్వే నెంబర్లు, అనుభవంలో ఉన్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను ఇవ్వాలని తహశీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌వో బి.పుల్లయ్య, కుప్పం, నగరి, చిత్తూరు ఆర్డీవోలు శ్రీనివాస రాజు, వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణంలో ఆర్‌అండ్‌బి రోడ్లు గుంతలు మయం అయ్యాయి. ద్విచక్ర వాహన దారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో పట్టణంలోని నానాసాపేటకు చెందిన గోపాల్ తను సొంత డబ్బుతో ట్రాక్టర్‌తో మట్టిని తెప్పించారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. నాయకులు, అధికారులు స్పందించి పట్టణంలోని రామసముద్రం రొడ్డును గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్, నాయకులు అయూబ్ డిమాండ్ చేశారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు రోడ్డుపై కొచ్చి నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయితే అధికారుల వద్ద నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు.

నాయీ బ్రాహ్మణ యువజన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణంలోని నాయీ బ్రాహ్మణ చైతన్య శక్తి యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ అధ్యక్షుడు వెంకటేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో కట్ట మీద వెలసి ఉన్న శ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఆలయంలో నాయీ బ్రాహ్మణ చైతన్య శక్తి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులందరూ హాజరై నూతన పట్టణ అధ్యక్షులుగా వెంకటేష్, కోశాధికారిగా పడిగల హేమంత్ కుమార్, కార్యదర్శిగా నంజంపేట చంద్రన్న, గౌరవ అధ్యక్షులు జిసి సీతారామయ్య, వైస్ ప్రెసిడెంట్ భద్ర రమణ సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారు..

- టిపీసీసీ అధ్యక్షులు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్

టిపిసిసి అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భవిష్యత్తులో రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా మహేష్ కుమార్ గౌడ్‌కు తిరుపతి, చిత్తూరు జిల్లాల కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో అభినందనను ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మరింత పుంజుకుందని , రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకోవడానికి విఫల యత్నాలు చేస్తున్నారని, ఏపీసీసీ బలోపేతానికి ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరితే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, , డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలతో కలిసి ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, తిరుపతి పట్టణ అధ్యక్షులు చిట్టిబాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు భాస్కర్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు నాగరాజుగౌడ్, వాసు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసేది కాంగ్రెస్ టిఅన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బుల్లెట్ రవి, శివశంకర్, దామోదర్ రెడ్డి, నాని, వేల్ రెడ్డి, లోకేష్ రెడ్డి, ఉమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్వియూలో ముగిసిన రెండవ విడత పిజి అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో అక్టోబర్ 4వ తేదీ నుంచి 7 వ తేదీ వరకు రెండవ విడత పిజి అడ్మిషన్లు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పిజి సెట్ -2024 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి, రెండవ విడతల్లో ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో సర్టిఫికెట్లు పరిశీలించారని వివరించారు. ఇందులో అన్ని సబ్జెక్టులకు కలిపి మొత్తం 2,080 సీట్లు క్యాంపస్ లో వుండగా 1,215 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో చేరారని తెలిపారు. ఇందులో ఆర్ట్స్ విభాగాల్లో 267, సైన్స్ విభాగాల్లో 576, కామర్స్ విభాగంలో 108 మంది , ఎంబిఏ విభాగంలో 132 మంది, ఎంసిఏ విభాగంలో 132 మంది విద్యార్థులు అడ్మిషన్స్ పొందారని, దాదాపు 59 శాతం విద్యార్థులు విశ్వవిద్యాలయంలో చేరారని ఎస్వీయూ రిజిస్ట్రారు, డిఓఏ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబు తెలిపారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 14 సంవత్సరాలు లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర పేర్కొన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా బాల కార్మికులను పనిలో పెట్టు కోకూడదని కోర్టు సిబ్బంది, పుత్తూరు కార్మిక శాఖ అధికారి హేమాచారి కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు హోటల్లో వెల్డింగ్ షాపుల్లో, ఇతర దుకాణాల్లో, వాణిజ్య సముదాయాల్లో 14 సంవత్సరాలు కంటే తక్కువగా వున్న చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీన్ని విస్మరించి ఎవరైనా పనిలో పెట్టుకుంటే దుకాణ యజమానిపై చర్యలు చట్టపర మైన చర్యలు తీసుకుని జరిమా నా, దుకాణ యాజమాన్యానికి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు కలిసి పట్టణంలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి యజమానులకు అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలను బడికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ

ఆహారం పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాసులు 64మంది గర్భిణులకు ఆహారం అందజేశారు. డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

ఏపీఎంగా ఫరీద్ మస్తాన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల మహిళ సమాఖ్య ఏపిఎంగా ఫరీద్ మస్తాన్ బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. పాలసముద్రం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చి పేద కుటుంబాలు లేకుండా చేయడమే తన లక్ష్యమని అన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్ళపల్లె పంచాయతీలో సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి, సెక్రటరీ ధనలక్ష్మీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీల్లో పెరుపోయిన చెత్తను తొలగించారు. కాలువలు శుభ్రం చేయించారు. జేసీబీతో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలను తొలగించారు.

సన్మానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో తూంపాయనపల్లి పంచాయతీ కార్యదర్శిగా శ్రీ వాణికి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జోష్నాకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నీరజాక్షలు గౌడ్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శులు విధులు చేపడుతున్నారని వారిని గుర్తించుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్, గ్రామస్తులు రాధిక తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: శునకం అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి వృద్ధుడినికి రక్తగాయాలైన సంఘటన బుధవారం పలమనేరు రూరల్ మండలం సాకే ఊరు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పలమనేరు కుప్పం రహదారిపై తన ద్విచక్ర వాహనంలో వృద్ధుడు అహ్మద్ బాషా ప్రయాణిస్తుండగా హఠాత్తుగా శునకం అడ్డుపడింది. తప్పించబోయిన క్రమంలో బైక్ అదుపుతప్పి అహ్మద్ బాషా రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర రక్తగాయమైంది. దీంతో స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు.

'కన్సల్టెన్సీ సేవలు' పై సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో కన్సల్టెన్సీ సేవలు పై బుధవారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ కళాశాలల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వి రవి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులతో నిర్మాణ రంగంలో యన్ఇసిజికి వున్న నమూనాలను పరీక్షించే సామర్థ్యం నమూనాలను పరీక్షించే పరికరాలు, సర్వేయింగ్ అంచనా, ధృవీకరణ జారీ గురించి వివరించారు. అనంతరం కొత్త సాంకేతికత గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ కంపెనీల ప్రతినిధులు పి దశరథరామ్, సూర్యప్రకాష్ రెడ్డి, ఎస్ కె నాగూర్ బాషా, పివి మనోజ్ కుమార్ , కళాశాల ఏవో కొండా రెడ్డి పాల్గొన్నారు.

పేదల సేవలో సాయి మాత సేవా ట్రస్ట్

వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పేదల సేవలో సాయి మాతా సేవ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంలు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు స్థానిక విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థుల సహకారంతో వరద బాధితుల సహాయార్థం విరాళాలను సేకరించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ట్రస్ట్ సేకరించిన విరాళాలను బాధితులకు అందజేయడానికి బుధవారం కుప్పం నుంచి వాహనం బయలుదేరింది. ఈ వాహనాన్ని ఎమ్మెల్సీ, ఆర్టీసీ ఉపాధ్యక్షులు జండా ఊపి ప్రారంభించారు.

రికార్డుల పరిశీలన

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్యాలయ రికార్డులు పక్కాగా ఉండాలని ఆర్‌డీవో శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం వెదురుకుప్పం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పలు వివరాలను తహశీల్దార్ రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి: డీఎంహెచ్‌వో

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు. బుధవారం చిత్తూరులో మహిళ పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18ఏళ్ల లోపు జరిగే వివాహాలు చట్టరీత్యా నేరం, బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. అలాగే టీనేజ్ ప్రెగ్నెన్సీపై కలిగే అనర్థాలపై, (పిసిపిఎన్‌డిటి యాక్ట్) 1994, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అనే విషయంపై అవగాహనతోటి బాధ్యతతో ప్రతి ఒక్కరు నిర్వహించినట్లయితే మాత శిశు మరణాల నివారణకు దోహద పడిన వారవుతామని తెలిపారు. స్థానిక పోలీస్ ట్రెనింగ్ కేంద్రంలో పలమనేరు మహిళా పోలీసులకు మహిళా, యుక్తవయసు బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ హైమావతి, ఆర్‌బిఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, పలమనేరు సిడిపిఓ వాణి, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, లీగల్ ఆఫీసర్ వెంకటేశులు, ప్రొటెక్షన్ ఆఫీసర్ శివశంకర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని కార్వేటినగరం ప్రాజెక్టు అధికారి పద్మ సునంద అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభాలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు పొందొచ్చునని వ్యవసాయ అధికారి వనిత అన్నారు. బుధవారం మండలంలోని పాతగుంట, కేవీఎం అగ్రహారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. తక్కువ పెట్టుబడి ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలను రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా ముత్యాలమ్మ

ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కరణం సంక్షేమ సంఘం సభ్యులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పలమనేరు: పలమనేరు పాతపేటలో వెలసిన కనకదుర్గా దేవాలయంలో శరన్నవరాత్రి

పట్టు వస్త్రాలు సమర్పణ

పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: మండలంలోని వివి పురం పంచాయతీలో వెలసిన ఆరిమాని గంగమ్మ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్, మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా బుధవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించిన అనంతరం విచ్చేసిన భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రాజశేఖర్ నాయుడు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచరపతి రెడ్డి, జలంధర్ నాయుడు, వెంకటరమణ, సిద్దయ్య శెట్టి, ముని రెడ్డి, హేమాద్రి యాదవ్ స్థానికులు జగన్నాథ నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, బాలసుబ్రమణ్యం, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని ఆర్‌కెవిబీ పేట గ్రామంలో అన్నా రెడ్డి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరిమాని గంగమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంగల్రాయ్ యాదవ్, రాజేందర్ రెడ్డి, జనార్దన్ రాజు, నాగేశ్వరాజు, రవి యాదవ్, హేమంత్ రెడ్డి, ఢిల్లీ బాబు రెడ్డి, శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అన్ని పుస్తకాలూ చదవాలి: విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వియూ ప్రధాన గ్రంథాలయంలో అన్ని పుస్తకాలూ చదవాలని ఎస్వియూ విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రతి ఏటా నిర్వహించే సరస్వతీ పూజను బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎస్వియు ప్రధాన గ్రంథాలయం అధికారి ఆచార్య కొంగర సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్వియూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చక్కగా విద్యా బుద్ధులు అలవడేలా మంచి సంస్కారవంతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్వీయూ విద్యార్థులు వర్సిటీలోని ప్రధాన గ్రంథాలయంలోని వివిధ రకాల అన్ని విభాగాల పుస్తకాలను, అన్ని భాగాలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రరీ నుంచి తీసుకుని, ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఎస్వీయూ విద్యార్థులు క్రమశిక్షణగా పట్టుదలతో చదివి ఉన్నతరంగాలలో రాణించాలని కోరారు. గ్రంథాలయ అధికారి ఆచార్య సురేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రధాన గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను, పిరియాడికల్స్, జర్నల్స్ లను చూసేందుకు మంచి అవకాశం ఉందన్నారు. ఇలాంటి అవకాశాన్ని ఎస్వీయూలో చదివి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఉద్యోగులు, నాన్ టీచింగ్ అసోసియేషన్ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై ఉచిత అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్, టాటా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలలోని అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులకి క్యాన్సర్ పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల వలన్ల పురుషులు, మహిళ లు అనే లింగ వివక్ష లేకుండా చూసుకోవాలన్నారు. క్యాన్సర్ ఎవరికి ఎప్పుడు, ఎందుకు, ఎలా వస్తుందో చెప్పలేమని, క్యాన్సర్ శరీరంలోని ఏ భాగంలోనైనా రావొచ్చు. నోరు, ఛాతీ, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణశయ, కాలేయ క్యాన్సర్ ల వంటి దాదాపు 100కు పైగా క్యాన్సర్ రకాలు ఉన్నాయన్నారు. గడిచిన 30 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా 50 ఏళ్ల లోపు వయస్సు గల వారిలో క్యాన్సర్ కేసులు ఏకంగా 79 శాతం పెరిగాయంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వుందో తెలుసు కోవాలని సూచించారు. ఇందులో భాగంగా సిబ్బంది కి ఉచితంగా బిపి,షుగర్, స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ రమేష్ బాబు, డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ హేమంత్, డా. వెంకయ్య బాబు, స్టాఫ్ నర్స్ మెహతాజ్, డీఈఓ మహేందర, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రెడ్డి కుమారి, విద్యార్థులు పాల్గొ న్నారు.ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలుకు కృషి చేయాలని కోరారు.